సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం, 14, మే, 2025

గరిష్టం/కనిష్టం
39°/27°

వాతావరణం

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం జల్లులు పడే అవకాశం ఉంది.

డబ్బులిస్తేనే ధాన్యం దిగుమతి !

చండ్రుగొండ : కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు నానా కష్టాలు పడాల్సి వస్తోంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులకు తోడు మిల్లర్లు పెట్టే కొర్రీలతో భయాందోళన చెందుతున్నారు. అధికారులు చెప్పే మాటలకు, కొనుగోలు కేంద్రాల వద్ద పరిస్థితికి చాలా తేడా ఉంటోంది. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత కూడా.. నాణ్యత లేదని, డబ్బులు ఇస్తేనే దిగుమతి చేస్తామని మిల్లర్లు పేచీలు పెడుతున్నారు. చండ్రుగొండ మండలం తుంగారంలో గానుగపాడు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. 13 మంది రైతులకు చెందిన 840 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసిన నిర్వాహకులు మిల్లులకు ఎగుమతి చేశారు. బస్తాకు 40 కేజీల చొప్పున తూకం వేయాల్సి ఉండగా తరుగు పేరుతో 41.200 కేజీలు కాంటా పెట్టారు. అయినా భరించిన రైతులు.. 15 రోజులు కావొస్తున్నా డబ్బులు తమ ఖాతాలో పడకపోవడంతో సొసైటీ సిబ్బందిని సంప్రదించారు. కాగా, ఈ 13 మంది రైతులకు చెందిన 840 క్వింటాళ్ల ధాన్యాన్ని ఇల్లెందు, బూర్గంపాడు మండలం లక్ష్మీపురం రైస్ మిల్లులకు తరలించగా.. ధాన్యం నాణ్యంగా లేదంటూ వారు దిగుమతి చేసుకోలేదని, చివరకు రైస్ మిల్లుల బాధ్యులకు రూ.60 వేలు ఫోన్ పే ద్వారా డబ్బు చెల్లిస్తేనే దిగుమతికి అంగీకరించారని రైతులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఘటనపై అధికారులు ఆరా తీసినట్లు తెలిసింది.

ప్రశాంతంగా పాలిసెట్

సింగరేణి(కొత్తగూడెం) : జిల్లాలోని 11 కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన పాలిసెట్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 3,352 మంది విద్యార్థులకు గాను 3,117 మంది హాజరయ్యారని పరీక్ష కన్వీనర్ బండి శ్రీనివాస్ తెలిపారు. కొత్తగూడెంలోని ఆరు కేంద్రాల్లో 1,988 మందికి 1,840 మంది, భద్రాచలంలోని రెండు సెంటర్లలో 719 మందికి 659 మంది, మణుగూరులోని మూడు కేంద్రాల్లో 645 మందికి 618 మంది హాజరయ్యారని వివరించారు.

న్యూస్‌రీల్

నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న బలరామ్

ఇల్లెందు : బొగ్గు ఉత్పత్తిలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని సింగరేణి సీఎండీ బలరామ్ సూచించారు. మంగళవారం ఆయన ఇల్లెందులో ఏరియాలోని పూసపల్లి ఓసీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక జీఎం కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతూ.. పూసపల్లి ఓసీ పనులు త్వరగా పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభించాలని అన్నారు. ప్రణాళికాయుతంగా పని చేస్తూ ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు. సమావేశంలో సింగరేణి డైరెక్టర్లు డి.సత్యనారాయణరావు, కె.వెంకటేశ్వర్లు,ఎల్.సూర్యనారాయణ, ఏరియా జీఎం వీసం కృష్ణయ్య, అధికారులు రామస్వామి, కృష్ణమోహన్, మోహన్‌రావు, రవికుమార్ పాల్గొన్నారు. కాగా, పూసపల్లి ఓసీని త్వరగా ప్రారంభించాలని కోరుతూ గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి నజీర్‌అహ్మద్ ఆధ్వర్యంలో సీఎండీకి వినతిపత్రం అందజేశారు.

సీనియర్ల సలహాలు పాటించాలి

భద్రాచలంటౌన్: ఐటీడీఏ పరిధిలో హాస్టల్ సంక్షేమాధికారులుగా బాధ్యతలు చేపట్టిన వారు విధి నిర్వహణలో సీనియర్ల సలహాలు పాటిస్తూ పని చేయాలని పీఓ బి.రాహుల్ అన్నారు. ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ పాఠశాలలు, వసతిగృహాల్లో పిల్లల పట్ల బాధ్యతగా ఉండాలని, బాలికలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనుమతి లేకుండా ఎవరు సెలవులు పెట్టొద్దని, పిల్లల సంరక్షణపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ పాల్గొన్నారు.

టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం

- రాష్ట్రంలో 57వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించాం
- ‘వికాసం’ ద్వారా నిరుద్యోగులకు స్వయం ఉపాధి పథకాలు
- బీఆర్‌ఎస్ ప్రభుత్వం యువతను మోసం చేసింది
- డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క



సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పక్కన కలెక్టర్ జితేష్ వి పాటిల్, పొదెం వీరయ్య తదితరులు

టేకులపల్లి : రాష్ట్రంలో తాము అధికారంలోకి రాగానే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేశామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్‌రోడ్‌లో రూ.1.15 కోట్లతో నిర్మించనున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత కోయగూడెంలో విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే ఉద్యోగాలు వస్తాయని, ఆత్మగౌరవంతో బతకొచ్చని ఆశించిన యువతను బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగులు నిరాశ, నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో అధికారంలోకి వచ్చిన తాము సుమారు 57వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించామని, జాబ్ క్యాలెండర్ ప్రకటించామని తెలిపారు. నిరుద్యోగులు స్వయం ఉపాధి సాధించేలా రూ.9వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. బయ్యారం చెరువు, తులారం ప్రాజెక్టు నీటి కోసం మహబూబాబాద్, ఇల్లెందు ఎమ్మెల్యేలు వినతిపత్రాలు ఇచ్చారని, సర్వే నిర్వహించి నీటిని తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య, కలెక్టర్ జితేష్ వి పాటిల్, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, ఐటీడీఏ పీఓ రాహుల్, ఇల్లెందు, వైరా ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, మాలోతు రాందాస్ నాయక్, ఎస్పీ రోహిత్ రాజు, ఆర్డీఓ మధు, అదనపు కలెక్టర్ విద్యాచందన, విద్యుత్ శాఖ ఎస్ఈ మహేందర్, ఈఈ వెంకటేశ్వర్లు, డీఈలు నందయ్య, రంగస్వామి, ఏడీఈలు యాసిన్, హేమచంద్రబాబు, ఏఈలు పి.బుజ్జికన్నయ్య, దేవా, కె వేణు, రాజేష్, నాయకులు కోరం సురేందర్, మడత వెంకట్ గౌడ్, ఏలూరి కోటేశ్వరరావు, భూక్య దేవా, బానోత్ సుజాత, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన వేగంగా సాగాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం



కిట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల పరిశీలన రెండు రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ పీఓ రాహుల్‌తో కలిసి మంగళవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దరఖాస్తుల పరిశీలన అనంతరం అర్హుల జాబితాను రూపొందించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల వారీగా విభజించాలని అన్నారు. అర్హుల జాబితాలో ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులకు ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. జూన్ 2న లబ్ధిదారులకు మంజూరుపత్రాలు అందజేసేలా ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. ప్రతీ నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లకు గాను మొదటి విడతలో మండలానికి ఒక గ్రామపంచాయతీని ఎంపిక చేశామని, మిగిలిన పంచాయతీల్లో అర్హుల జాబితా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ‘జల్ సంచయ్ జెన్ భాగీదారి’ పథకం కింద జిల్లాలో భారీగా ఇంకుడుగుంతల నిర్మాణం చేపడుతున్నామని, ఈ విషయంలో జిల్లా దేశంలోనే మొదటి స్థానానికి చేరువలో ఉందని వివరించారు. ప్రథమ స్థానం పొందిన జిల్లాకు రూ.2 కోట్ల బహుమానం వస్తుందని తెలిపారు.

టీబీ బాధితులకు పోషకాహార కిట్లు

జిల్లాలోని 1,030మంది టీబీ బాధితులకు గ్రాన్యూల్ ఇండియా లిమిటెడ్ ఔషధ సంస్థ ఆధ్వర్యంలో కలెక్టర్ పాటిల్, సంస్థ ఈడీ చిగురుపాటి ఉమ చేతుల మీదుగా పోషకాహార కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఉమ మాట్లాడుతూ.. 2025 నాటికి టీబీని నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఈ కిట్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ మేనేజర్ అల్లం అవినాష్, డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్, డిప్యూటీ డీఎంహెచ్ఓ జయలక్ష్మి, పుల్లారెడ్డి, మధువరన్, హరీష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నల్లగొండ జిల్లా రైతుల క్షేత్ర సందర్శన



పామాయిల్ క్షేత్రంలో నల్లగొండ జిల్లా రైతులు

అశ్వారావుపేటరూరల్: నల్లగొండ జిల్లాకు చెందిన రైతుల బృందం మంగళవారం అశ్వారావుపేటలో పర్యటించింది. నాబార్డు, ఇంటిగ్రేటెడ్ గ్రామీణాభివృద్ధి సొసైటీ ద్వారా 50 మంది రైతుల బృందం ముందుగా మండలంలోని నారంవారిగూడెం వద్ద గల ఆయిల్‌ఫెడ్ కార్యాలయం, నర్సరీలు, పామాయిల్ ఫ్యాక్టరీ, పలువురు రైతులకు చెందిన పామాయిల్ క్షేత్రాలను సందర్శించారు. అనంతరం స్థానిక వ్యవసాయ కళాశాలను సందర్శించగా, ఆయా రైతులకు కళాశాల శాస్త్రవేత్తలు.. ఆయిల్‌పాంలో నీటి యాజమాన్యం, అయిల్‌పాం సాగులో రైతులు పాటించాల్సిన పద్ధతులు, జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో కళాశాల శాస్త్రవేత్తలు డాక్టర్ నీలిమా, డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ చరిత, తేజస్విని, శ్రావిక, అనూష, రైతుల బృందం పాల్గొన్నారు.

రీ వెరిఫికేషన్‌లో అదనపు మార్కులు



విద్యార్థినికి పుష్పగుచ్ఛం ఇస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులు సాధించి, రీ వెరిఫికేషన్‌లో మరో రెండు మార్కులు సాధించిన విద్యార్థిని కె.హాసినిని కృష్ణవేణి కళాశాల డైరెక్టర్ మాచవరపు కోటేశ్వరరావు అభినందించారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినికి పుష్పగుచ్ఛం అందించారు. హాసినికి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకు 994 మార్కులు వచ్చాయని, రీ వెరిఫికేషన్‌లో మరో రెండు మార్కులు రాగా.. మొత్తం 996 మార్కులు సాధించిందని చెప్పారు.

స్పీడ్‌బోటు సిద్ధం

పాల్వంచరూరల్: కిన్నెరసాని జలాశయంలో టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంస్థ ఆధ్వర్యంలో నడుపుతున్న బోట్లు మూడు ఆదివారం దెబ్బతిన్న విషయం విదితమే. సదరు బోట్లకు మరమ్మతులు చేసేందుకు హైదరాబాద్ నుంచి మెకానిక్‌లు వచ్చారు. స్పీడ్ బోటును సిద్ధం చేశారు. పెద్ద బోటుకు సైతం మరమ్మతులు చేపట్టారు.

సరస్వతి నది పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

- 15 నుంచి 26 వరకు సర్వీసులు

ఖమ్మంమయూరిసెంటర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న పుష్కరాలకు వెళ్లే భక్తుల కోసం ఉమ్మడి జిల్లా నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపించనున్నట్లు ఆర్టీసీ ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ.సరిరామ్ తెలిపారు. తొలుత ఖమ్మం, కొత్తగూడెం, మణుగూరు డిపోల నుంచి ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడుపుతామని వెల్లడించారు. ఖమ్మం నుంచి ఉదయం 6 గంటలకు బయలుదేరే సర్వీస్ మధ్యాహ్నం 12 గంటలకు కాళేశ్వరం చేరుకోనుండగా, తిరిగి సాయంత్రం 4 గంటలకు అక్కడి నుంచి బయలుదేరుతుందని తెలిపారు. ఇందులో పెద్దలకు రూ.480, పిల్లలకు రూ.260 చార్జీ ఉంటుందని పేర్కొన్నారు. కొత్తగూడెం నుంచి ఉదయం 6 గంటలకు, కాళేశ్వరం నుంచి సాయంత్రం 4.30 గంటలకు బస్సు బయలుదేరుతుందని, ఇందులో పెద్దలకు రూ.580, పిల్లలకు రూ.300 చార్జీగా నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే, మణుగూరులో ఉదయం 6 గంటలకు, తిరిగి కాళేశ్వరం నుంచి 3.30 గంటలకు బస్సు బయలుదేరుతుందన్నారు. కాగా, కాళేశ్వరం పుష్కరాలకు వెళ్లాలనుకునే భక్తులు డిపోల్లో సంప్రదిస్తే బస్సులు ఏర్పాటు చేస్తామని ఆర్ఎం తెలిపారు.

రిటైర్డ్ ఆర్మీ సుబేదార్ మృతి



జాన్‌రత్నం (ఫైల్)

పాల్వంచ: అనారోగ్య సమస్యలతో రిటైర్డ్ ఆర్మీ సుబేదార్ తాళ్లూరి జాన్‌రత్నం (80) పట్టణంలోని కాంట్రాక్టర్స్‌కాలనీలోని తన నివాసంలో మంగళవారం మృతి చెందారు. దేశం కోసం అనేక ప్రాంతాల్లో ఆర్మీలో కీలక విధులు నిర్వహించారు. పంజాబ్, జమ్మూకశ్మీర్, మీజోరాం, రాజస్థాన్, మణిపూర్, త్రిపుర వంటి అనేక ప్రాంతాల్లో ఆర్మీలో 30 ఏళ్ల పాటు విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందారు. అనంతరం పాల్వంచలోని ఎన్ఎండీసీ కర్మాగారంలో 9 ఏళ్లపాటు సెక్యూరిటీ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు కాగా అనిల్ అనే కుమారుడు సైతం ఆర్మీలో విధులు నిర్వర్తించి రిటైర్డ్ అయ్యారు. జాన్‌రత్నం మృతదేహాన్ని ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగులు ఎస్‌డీ ఖలీద్, భాస్కర్‌రావు, టి.షడ్రక్, డీకే ప్రసాద్, కె.శేషుబాబు, పట్టణ ప్రముఖులు పలువురు సందర్శించి నివాళులర్పించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,058

వినోదం.. విజ్ఞానం..

పాఠశాలలకు వేసవి సెలవులు ఇచ్చిందే తడవుగా విద్యార్థులు స్వగ్రామాలకు లేదంటే అమ్మమ్మ, నానమ్మ ఇళ్లకు పరుగులు తీస్తుంటారు. కొందరు ఇంటి వద్దే టీవీలు, సెల్‌ఫోన్‌లతో కాలక్షేపం చేస్తారు. అయితే ఈ సెలవుల్లో విజ్ఞానం పొందుతూ.. వినోదాన్ని ఆస్వాదిస్తూ.. శరీర సౌష్టవాన్ని పెంచుకునేలా విద్యాశాఖ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లావ్యాప్తంగా 50 ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి శిక్షణ శిబిరాలను ప్రారంభించింది. ఈ నెల 10 నుంచి 21వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఈ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు చేపట్టారు. ప్రతీ రోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. ఎండ తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు శిక్షణ శిబిరంలో అల్పాహారం కూడా అందిస్తోంది.

– ఇల్లెందురూరల్

- ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి శిబిరాలు
- పలు అంశాలపై చిన్నారులకు శిక్షణ
- ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు



నాట్యం నేర్చుకుంటున్న చిన్నారులు

నేర్పిస్తున్న అంశాలు..

శిబిరాలకు హాజరయ్యే చిన్నారులకు విద్యా శాఖ నిర్దేశించిన విధంగా పలు అంశాలపై ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. 8 గంటలకు యోగా, మెడిటేషన్, ప్రాణాయామంపై తర్ఫీదునిస్తున్నారు. అనంతరం అత్యధికంగా విద్యార్థులకు ఇష్టమైన క్రికెట్ ఆటతో పాటు వి ద్యార్థుల్లో విజ్ఞానం పెంచే చెస్, క్యారమ్స్, వైకుంఠపాళి వంటి ఆటలపై శిక్షణ ఇస్తున్నారు. ఇంతేకాకుండా చిత్రలేఖనం, మట్టితో, కాగితాలతో బొమ్మల తయారీ, భరతనాట్యం, క్లాసికల్ డాన్స్, మార్షల్ ఆర్ట్స్ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తూ మాల్గుడి కథలను చిన్నారులకు వినిపిస్తూ గ్రామీణ జీవన సౌందర్యంపై అవగాహన కల్పిస్తున్నారు. ఇంతేకాకుండా విద్యార్థుల చేత సైన్స్ ప్రయోగాలు చేయిస్తూ సైన్స్ పరికరాలపై అవగాహన కల్పిస్తున్నారు.

ఆసక్తిగా.. ఆలోచింపజేసివిగా..

శిబిరంలో ఆటపాటలతోపాటు విజ్ఞానం పెంచుకునేలా పలు అంశాలపై చిన్నారులకు శిక్షణ ఇస్తున్నారు. యోగా, మెడిటేషన్ చేయిస్తూ వాటి వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నారు. చెస్, క్యారమ్స్, వైకుంఠపాళి ఆటల్లో పోటీతత్వం అలవడేలా తర్ఫీదు ఇవ్వడం ఆకట్టుకుంటోంది. స్థానికంగా సేకరించిన మట్టి, కాగితాలతో బొమ్మలను తయారు చేయించి వారిలో దాగి ఉన్న కళాత్మక నైపుణ్యాన్ని వెలికితీస్తున్నారు. చివరగా పాఠ శాల ఆవరణలో చిన్నారుల చేత మొక్కలు నాటించి వాటి ఆలనపాలన ఎలా చూడాలో శిక్షణ ఇస్తున్నా రు. తద్వారా ఇంటి పరిసరాల్లో ఖాళీ స్థలాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలో అవగాహన కల్పిస్తున్నారు.

ఆనందంగా ఉంది



వేసవిలో శిక్షణ శిబిరానికి హాజరు కావడం ఇదే ప్రథమం. ఎంతో ఆనందంగా ఉంది. శిబిరంలో ఉపాధ్యాయులు నేర్పిస్తున్న అంశాలు బాగున్నాయి. శిబిరం తరువాత కూడా ఆయా అంశాలపై సాధన చేసి నైపుణ్యం పెంచుకుంటా.

–డార్విన్ సిద్ధార్థ్, 7వ తరగతి, 21పిట్ హైస్కూల్, ఇల్లెందు మండలం

ఆకట్టుకుంటున్నాయి..



శిబిరంలో ఆటపాటలకే పరిమితం చేస్తారు అనుకున్నా. విజ్ఞానం పెంచుకునేలా పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. మట్టి బొమ్మల తయారీ, సైన్స్ పరికరాల తయారీ, కిచెన్ గార్డెన్, మాల్గుడి కథలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి.

–సుప్రతిక, 9వ తరగతి, 21పిట్ హైస్కూల్, ఇల్లెందు మండలం

ఉల్లాసంతోపాటు విజ్ఞానం..



వేసవి ఉచిత శిక్షణ శిబిరంలో చిన్నారులకు ఆటపాటలతో ఉల్లాసాన్ని అందించడంతోపాటు విజ్ఞానం పెంచుకునేలా పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నాం. చిన్నారులు ఎంతో ఆసక్తితో క్రమం తప్పకుండా శిక్షణకు హాజరవుతూ నేర్చుకుంటున్నారు. అల్పాహారం హాజరుశాతం పెరిగేందుకు ఉపకరిస్తోంది. –సంతోష్‌కుమార్, క్యాంప్ ఇన్‌చార్జ్, 21పిట్ హైస్కూల్, ఇల్లెందు మండలం

పరారీలో నకిలీ ఏటీఎం కార్డుల ముఠా

కొత్తగూడెంఅర్బన్: నకిలీ (క్లోనింగ్) ఏటీఎం కార్డులతో ఖాతాదారులను మోసగిస్తున్న ముఠా విషయమై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్ సూచించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన హరిదాస్ బిశ్వాస్, దిజన్ మంజుదార్, సోనాల్ నరేంద్ర విఖార్, అషిత్ దత్తా ముఠాగా ఏర్పడి నకిలీ ఏటీఎం కార్డులు రూపొందిస్తున్నారని, ఆపై బ్యాంకర్ల పేరిట ఖాతాదారులకుఫోన్ చేసి డబ్బులు డ్రా చేస్తున్నారని వెల్లడించారు. వీరిపై కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లోకేసు నమోదు కాగా, రిమాండ్ ఖైదీలుగా ఉటూబెయిల్‌పై బయటకు వచ్చాక విచారణకు హాజరుకావడం లేదని తెలిపారు. ఈ నేపథ్యాన భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో ఏటీఎంల వద్ద అనుమానితులు కనిపించినా, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఫోన్ వచ్చినా 87126 82017 నంబర్‌లో సంప్రదించాలని సీఐ ఓ ప్రకటనలో కోరారు.

గాలి వానతో ఆగమాగం



కరకగూడెం: రహదారిపై పడిన భారీ వృక్షాలు



చర్ల: ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పులు

కరకగూడెం: మండలంలోని పలు గ్రామాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండగా సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆకాశం మేఘావృతమై భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో రేగళ్ల వెళ్లే దారిలో చెట్లు రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. అనంతారంలో ఓ పెళ్లి ఇంటి సమీపంలో తాటిచెట్టు, విద్యుత్ స్తంభం మధ్యలో పిడుగుపడి మంటలు చెలరేగాయి. దీంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు.

చర్లలో..

చర్ల: మండలంలో మంగళవారం సాయంత్రం వీచిన గాలి దుమారం బీభత్సం సృష్టించింది. ఉన్నట్లుండి ఒక్కసారిగా వీచిన గాలి దుమారం వల్ల మండలంలోని ఉప్పరిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని గుట్టబోరులో ఐదుగురు గిరిజనుకు చెందిన ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. పెద్ద ఎత్తున చెట్లు విరిగిపడ్డాయి. గ్రామంలోని సోడి మనోజ్‌కుమార్, పర్షగిరి రాజారావు, పొడెం నాగరాజు, కారం రామారావు, గుండ్ల తిరుపతికి చెందిన ఇళ్లకు ఉన్న సిమెంట్, ఇనుప రేకులు ఎగిరిపోయాయి. ఇళ్ల కప్పులతో పాటు మరుగుదొడ్లు, పశువుల పాకల కప్పులు సైతం ఎగిరిపోయాయి. ఇళ్లల్లోని వస్తువులు సైతం గాలి దుమారంతో కొట్టుకుపోయినట్లు బాధితులు తెలిపారు. గిరిజనులకు సుమారు రూ.5 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలిసింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

కొనుగోళ్లను వేగవంతం చేయాలి



కొత్తగూడెంఅర్బన్: ధాన్యం కొనుగోలు కేంద్రంలో పౌరసరఫరాల అధికారులతో అదనపు కలెక్టర్

కొత్తగూడెంఅర్బన్/పాల్వంచరూరల్: ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టిపల్లి, పాల్వంచ మండలం రెడ్డిగూడెం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పౌరసరఫర శాఖ అధికారులతో కలిసి సందర్శించి, ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని సూచించారు. తాగునీరు, టెంట్, తూకపు, తేమ యంత్రాలు, గన్ని బ్యాగులు, టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన వెంటనే ధాన్యంను కేటాయించిన మిల్లులకు తరలించాలని, ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అనంతరం అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారి రుక్మిణి, పౌరసరఫరాల శాఖ మేనేజర్ త్రినాథ్‌బాబు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పీవీ కాలనీలో దొంగల బీభత్సం

బంగారం, నగదు అపహరణ



క్లూస్ టీంతో ఆధారాలు సేకరిస్తున్న ఎస్ఐ ప్రసాద్

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో కార్మిక కుటుంబాలు నివసించే క్వార్టర్లలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఏకకాలంలో ఏడు ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. కార్మిక కుటుంబాలు, పోలీసుల కథనం ప్రకారం.. ఎంసీ క్వార్టర్ 316లో నివసించే నాజర్‌పాషా బంధువుల ఇంటికి వెళ్లి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి బీరువాల్లో ఉన్న రూ.5 వేల నగదు, 10 తులాల వెండి అపహరించారు. దగ్గరలో ఉన్న మరో క్వార్టర్ 304లో కల్యాణపు రవికుమార్ 12న నైట్‌షిఫ్ట్ డ్యూటీకి వెళ్లి 13న వచ్చి చూడగా తలుపులు పగులగొట్టి, బీరువాలోని ఆరు గ్రాముల బంగారం, రూ.10 వేల నగదు చోరీకిగురైంది. మరో మూడు చోట్ల దొంగతనానికి యత్నించగా, అక్కడ ఇంట్లో నగదు, బంగారం లేకపోవడంతో స్వల్ప నష్టం జరిగినట్లు బాధితులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మేడా ప్రసాద్ ఘటనా స్థలాలను సందర్శించి బాధితుల నుంచి వివరాలు తెలుసుకుని క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఈ నెల 3న రాత్రి సుందరయ్యనగర్‌లోని రెండు ఇళ్లల్లో, 12న రాత్రి మరో చోట చోరీ జరగడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ఇకనైనా పోలీసులు గస్తీని మరింత పెంచాలని కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి



భార్య మృతదేహం వద్ద రోదిస్తున్న దేవయ్య

భద్రాచలంఅర్బన్: విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై ఓ యువతి మృతిచెందిన ఘటన పట్టణంలోని సీతారాంనగర్‌కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. ఏపీలోని బాపట్ల జిల్లా, చింతగుంపల్లి గ్రామానికి చెందిన దేవయ్య, గ్లోరి (25) దంపతులు మూడు వారాల కిందట భద్రాచలం వచ్చి సుందరయ్యనగర్‌లో ఉంటూ ఓవ్యక్తికి చెందిన బిల్డింగ్ పని (తాపీ) చేస్తున్నారు. ఈ క్రమంలో మొదటి అంతస్తులోని కొన్ని వస్తువులను తీసుకురావాలని దేవయ్య చెప్పడంతో.. గ్లోరిపైకి వెళ్లి వస్తువులు తెస్తున్న క్రమంలో విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురైంది. ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, గ్లోరి, దేవయ్యలకు 12ఏళ్ల కిందట వివాహం కాగా, ముగ్గురు మగ పిల్లలున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. టేకులపల్లిలోని ఏ-కాలనీ సక్యతండాకు చెందిన భూక్య లక్ష్మణ్ (35) బోడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 7న విధులు ముగించుకుని తన ద్విచక్రవాహనంపై వస్తుండగా పశువులు అడ్డురావడంతో కిందపడ్డాడు. ఆయన్ను కొత్తగూడెం ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా మంగళవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి భద్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి పట్టివేత

భద్రాచలంఅర్బన్: పట్టణ పరిధి కూనవరం రోడ్డులోని ఆర్టీఏ చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నారు. వారి కథనం ప్రకారం.. చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న అధికారులకు రెండు ద్విచక్రవాహనాలపై వస్తున్న ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. ఏపీలోని ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన భానుప్రకాష్, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన లాజర్, దుర్గారావు.. మోతుగూడెంలో 9.5 కేజీల గంజాయి కొనుగోలు చేసి వస్తుండగా పట్టుబడినట్లు ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు వెల్లడించారు. గంజాయి విలువ రూ.4.65 లక్షలు ఉంటుందని వారు పేర్కొన్నారు. తనిఖీల్లో ఎస్ఐ గౌతమ్, సిబ్బంది రామకృష్ణగౌడ్, హబీబ్‌పాషా, వెంకటనారాయణ, గురవయ్య, సుమంత్, శ్రావణి, పార్థసారథి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాపర్‌వైరు చోరీ

పాల్వంచరూరల్: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు చెందిన కాపర్‌వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. మండలంలోని బిక్కుతండా శివారులోని భూక్యా సక్రు పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, పల్లె ప్రకృతి వనంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను సోమవారం రాత్రి పగులగొట్టి రూ.20 వేల విలువైన కాపర్‌వైరును చోరీ చేసినట్లు రైతు సక్రు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశామని ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు.

కోళ్ల మృతిపై కేసు

పాల్వంచరూరల్: తొమ్మిది కోళ్లు మృతిచెందిన ఘటనపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని బంద్రుగొండ గ్రామానికి చెందిన నెల్లెళ్ల కలమ్మకు చెందిన తొమ్మిది పెరటికోళ్లు(నాటు) సోమవారం మరణించాయి. వాటికి ఎవరో మందు పెట్టడం వల్ల మృతి చెందాయని, ఓ మహిళపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ట్రాలీ బోల్తా పడి 13 మందికి గాయాలు

పాల్వంచరూరల్: ట్రాలీ బోల్తాపడి 13 మంది గాయపడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. మణుగూరు సమీపంలో మోకాళ్ల నొప్పులకు నాటు మందులు ఇస్తున్నారని.. చంద్రుగొండ మండలం తిప్పనపల్లికి చెందిన 13 మంది ట్రాలీ ఆటోలో బయలుదేరారు. పాల్వంచ మండలం జగన్నాథపురం శివారులో బీసీయం జాతీయ రహదారిపై వాహనం బ్రేకులు ఫెయిల్ కావడంతో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. అందులోని 13మంది గాయపడగా పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అందులో మహబూబీ అనే మహిళను మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ట్రాలీ వాహనం బోల్తా..

కలర్ డబ్బాల లోడుతో వెళ్తున్న ట్రాలీ వాహనం బోల్తాపడిన ఘటన మండలంలోని కేశవాపురం వద్ద మంగళవారం చోటుచేసుకుంది. భద్రాచలం నుంచి పాల్వంచ వైపు వస్తున్న వాహనం కేశవాపురం శివారులోని సీతానాగారం కాలనీ సమీపంలో బీసీయం జాతీయ రహదారిపై బోల్తాపడింది. వాహనంలో ఉన్న కలర్ డబ్బాలు అన్ని రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

ఐదెకరాల్లో సాగు చేసిన పంట దగ్ధం

రూ.1.50 లక్షల విలువైన మొక్కజొన్న అగ్నికి ఆహుతి



కాలిపోయిన మొక్కజొన్న కంకుల వద్ద విలపిస్తున్న మహిళా రైతు

గుండాల: ప్రమాదవశాత్తు మొక్కజొన్న కంకుల రాశికి నిప్పంటుకుని ఐదెకరాల్లో సాగు చేసిన పంట దగ్ధమైన ఘటన మండలంలోని నర్సాపురం తండాలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. నర్సాపురం తండాకు చెందిన మాలోత్ హేమ యాసంగిలో ఐదెకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. ఇటీవల కంకులు కోసి మిల్లర్‌లో పట్టించేందుకు కల్లంలో ఆరబోశాడు. కాగా, మంగళవారం తెల్లవారుజామున పక్క చేనులో కోసిన మొక్కజొన్న కొయ్యలను రైతు కాల్చుతుండగా ఆ మంటలు హేమ ఆరోబోసిన రాశికి అంటుకుని కంకులు కాలిపోయాయి. ఉదయాన్నే అక్కడికి వెళ్లిన కుటుంబసభ్యులు కాలిపోయిన కంకులను చూసి బోరున విలపించారు. కంకులతో పాటు కోసేందుకు సిద్ధంగా ఉన్న చేను, సాగునీటి కోసం అమర్చిన పైపులు సైతం కాలిపోయాయి. దీంతో రూ. 1.50 లక్షల మేర నష్టం వాటిల్లిందని, అధికారులు తమకు న్యాయం చేయాలని కుటుంబసభ్యులు వేడుకుంటున్నారు.

ప్రతీ రైతు పొలంలో నీటి కుంట నిర్మించుకోవాలి



కుంట నిర్మాణం కోసం చేసిన మార్కింగ్‌ను పరిశీలిస్తున్న డీఆర్డీఓ

జూలూరుపాడు: ప్రతి రైతు వ్యవసాయ భూమిలో నీటి కుంట నిర్మించుకోవాలని అదనపు కలెక్టర్, డీఆర్డీఓ విద్యాచందన అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని వీరభద్రాపురం, పడమటనర్సాపురం గ్రామాల్లో పర్యటించారు. వ్యవసాయ క్షేత్రాల్లో నీటి కుంటల నిర్మాణం కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించి, మాట్లాడారు. పొలాల్లో నీటి కుంటలు నిర్మించుకుంటే భూగర్భ జలాల అభివృద్ధితోపాటు, చేపల పెంపకం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ సెంటర్లు, ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, ఆస్పత్రులు, రహదారులు వెంట, ప్రతి ఇంట్లో ఇంకుడుగుంతల నిర్మాణాలు చేపట్టేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నీటికుంటలు, ఇంకుడు గుంతల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, ఎంపీఓ తులసీరామ్, ఈజీఎస్ ఏపీఓ రవికుమార్, జీపీ సెక్రటరీలు, ఉపాధి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అటవీ భూమి ఆక్రమణకు అడ్డుకట్ట



ఆక్రమణదారులను అడ్డుకుంటున్న అటవీశాఖ అధికారులు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం రేంజ్ పరిధి ములకలపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లోని పర్ణశాల సౌత్‌లోని 17 హెక్టార్ల అటవీ భూమిని గడ్డోరగట్ట గ్రామస్తులు ఆక్రమించడానికి యత్నించగా ఎఫ్‌డీఓ సుజాత ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం అడ్డుకున్నారు. ఈ 17 హెక్టార్ల భూమిలో 2023–24లో అటవీశాఖ మారుజాతి మొక్కల ప్లాంటేషన్ చేసింది. ఆ భూమిలోకి గడ్డోరగట్ట గ్రామస్తులు చొరబడి మొక్కలను కాలుస్తుండగా గతంలోనే వారిపై కేసు నమోదు కాగా.. ప్రస్తుతం కేసు హైకోర్టు పరిధిలో ఉంది. ఈ నెల 12న ప్లాంటేషన్ లోపలకి మళ్లీ అక్రమంగా ప్రవేశించి మొక్కలను నరికి పెద్ద చెట్లను కాలుస్తుండగా అటవీశాఖ సిబ్బంది అడ్డుకుని విషయాన్ని ఐటీడీఏ పీఓ దృష్టికి తీసుకెళ్లారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పీఓ సూచించారు. మంగళవారం ప్లాంటేషన్‌లోకి గ్రామస్తులు రాగా అటవీశాఖ సిబ్బంది అడ్డుకున్నారు. ఎఫ్‌డీఓ మాట్లాడుతూ.. అటవీశాఖ ప్లాంటేషన్‌లోకి అక్రమంగా ప్రవేశించి చెట్ల నరికితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.